## ప్రత్యేక తెలంగాణ కోసం

# ఇక అక్షర సంగ్రామమే..

• తెరవే రాష్ట్ర మహాసభల్లో గళమెత్తిన కలంయోధులు.. • అంబరాన్నంటిన తెలంగాణ సాహితీ సంబరం.. • హోరెత్తిన జై తెలంగాణ నినాదం..

నిర్మల్, సెప్టెంబర్ 2(ఆన్‌లైన్): తెలంగాణ కోసం ఇక అక్షర సంగ్రామమేనని తెరవే రాష్ట్ర మహాసభల్లో కలంయోధులు గళమెత్తారు. ఉద్యమాలు, త్యాగాలకు పురిటిగడ్డగా పిలవబడే నిర్మల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రచయితల వేదిక ఆరవ మహాసభలకు తెలంగాణలోని పది జిల్లాల నుంచి కలంయోధులు తరలివచ్చారు. ఇక్కడి మహాసభల వేదికకు కొమరం భీమ్, సామల సదాశివ ప్రాంగణంగా నామకరణం చేశారు. ఉదయం 10గంటలకు తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జులూరి గౌరీశంకర్ జెండాను ఆవిష్కరించారు. వేదిక ప్రవేశ ద్వారానికి ముందు ఏర్పాటు చేసిన తెలంగాణ యోధులు, కవులు, రచయితలు, కళాకారుల చిత్రపటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరాటకంగా కవులు, రచయితలు, జర్నలిస్టులు చేసిన ప్రసంగాలు తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశాన్ని సూచించాయి. మహాసభలకు జులూరి గౌరీ శంకర్ అధ్యక్షత వహించగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈయనతో పాటు హన్స్ ఇండియా పత్రిక ఎడిటర్‌టంకశాల అశోక్, నమస్తే తెలంగాణ ఎడిటర్ అల్లం నారాయణ, జానపద పరిశోధకులు జయధీర్ తిరుమల్ రావు, తెలంగాణ లాయర్స్ జాక్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సింగిడి రచయితల సంఘం కన్వీనర్ స్కైబాబా, సూరేపల్లి సుజాత, జూకంటి జగన్నాథం,అల్లం రాజయ్య, నలిమెల భాస్కర్, విమలక్క, కాశీం,


జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభిస్తున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి

మచ్చ ప్రభాకర్, నాలేశ్వరం శంకరం, అన్నవరం దేవేందర్, తంగిడిపల్లి నాగేంద్ర శర్మ, డా.అప్పాల చక్రధారి, ఆ.దామెర రాములు, నేర్నాల కిశోర్, అల్లం వీరయ్య, కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు నగునూరి శేఖర్ తదితరులతో పాటు వందలాది కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. ఈ మహాసభల సందర్భంగా రచయితలంతా తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ప్రభుత్వం ఈ తీర్మానాలను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జులూరి గౌరీశంకర్, జస్టిస్ నర్సింహారెడ్డిలు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. విమలక్క, ఇతర కళాకారులు పాడిన తెలంగాణ పాటలు ఉత్తేజం నింపాయి. రచయితలు, కవులు చేసిన ప్రసంగాలన్ని అందరిలో సమరోత్సాహం నింపాయి. టంకశాల అశోక్, అల్లం నారాయణ, నలిమెల భాస్కర్, విమలక్కలు చేసిన ప్రసంగాలు ఉద్యమానికి దిశా నిర్దేశాన్ని సూచించారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్ల కారణంగా మహాసభలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. నిర్మల్ పట్టణానికి ఉదయం నుండే వివిధ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు, కళాకారులు తరలి రావడంతో ఇక్కడి సాహితీ సంబరం ఉట్టిపడింది. మహాసభలలో వక్తల ప్రసంగాలకు తక్కువ సమయం కేటాయించడంతో పూర్తిస్థాయిలో సందేశాలు సభికులు వినలేకపోయారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా జరుగని విధంగా ఈ మహాసభలు విజయవంతం కావడంతో కవులు, రచయితలు, కళాకారుల్లో సమరోత్సాహం నెలకొంది. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పుస్తకాల ప్రదర్శన బహుళ ఆదరణ పొందింది. పుస్తకాలు, కవితా సంపుటిలు కొనేందుకు సాహితీ అభిమానులు బారులు తీరారు.


డా.దామెర రాములు రచించిన కొర్రాయి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయధీర్ తిరుమల్‌రావు, టంకశాల అశోక్


ఆరవ రాష్ట్ర మహాసభలకు పది జిల్లాల నుంచి తరలివచ్చిన కవులు, రచయితలు, కళాకారులు


ప్రముఖ కవి, సామల సదాశివకు సంతాప సూచకంగా సభలో మౌనం పాటిస్తున్న దృశ్యం


సీనియర్ పాత్రికేయులు, నగునూరి శేఖర్‌కు మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

# జిల్లాకు కొమురంభీం పేరు పెట్టాలి..

నిర్మల్, సెప్టెంబర్ 2(ఆన్‌లైన్): ఆదిలాబాద్ జిల్లాకు కొమరంభీమ్ పేరు పెట్టాలని, అలాగే జిల్లాలో ఆదివాసీ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు నిర్మల్‌లో ఆదివారం జరిగిన ఆరవ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. సామల సదాశివ పేరిట జాతీయ స్థాయిలో అవార్డును నెలకొల్పాలని, తెలంగాణ ప్రాంతానికి చెందిన సాహితీ వేత్తలు, కవులు, కళాకారుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. తెలంగాణ తెలుగు అకాడమిని ఏర్పాటు చేయాలని, తెలంగాణ ప్రాంతానికి చెందిన సాహితీ, సాంస్కృతిక వస్తువులను భద్రపరిచి భావితరాలకు గుర్తు చేసేందుకు గాను ఓ మ్యూజియంను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ఉద్యమాలతోనే తెలంగాణ వస్తుందని, హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ కావాలని రచయితలు మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. తెలంగాణ యాసలోని రచనలకు సముచిత స్థానం కల్పించాలని, సకల సంపదలతో కూడిన తెలంగాణ కావాలని, తెలంగాణలోని గిరిజనులపై, ముస్లీంలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని తీర్మానించారు. అలాగే జిల్లాలోని కుంటాల వద్ద నిర్మిస్తున్న హైడల్ ప్రాజెక్టును, ఓపెన్ కాస్ట్‌లను, టైగర్‌జోన్ ఏర్పాటును రద్దు చేయాలని తెలంగాణ రచయితల వేదిక నిర్ణయించింది. వీసెప్టెంబర్ 30న నిర్వహిస్తున్న తెలంగాణ మార్చ్‌లో కవులు, రచయితలు పాల్గొనాలని నిర్ణయించారు. అలాగే మరికొన్ని అంశాలతో కూడిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

### ఐకే రెడ్డిని నిలదీసిన కవులు, రచయితలు..

తెలంగాణపై వైఖరిని స్పష్టం చేయాలని మాజీ ఎంపీ ఇంద్రకరణ్‌రెడ్డిని పలువురు రచయితలు, కవులు నిలదీశారు. ఆదివారం నిర్మల్‌లో జరిగిన తెలంగాణ రచయితల వేదిక ఆరవ మహాసభలకు ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై కలకలం సృష్టించారు. ఐకేరెడ్డి నేరుగా వచ్చి ప్రముఖుల స్థానంలో కూర్చున్నారు. దీనిని గమనించిన తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జులూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ ఐకేరెడ్డి సమావేశానికి రావడం హర్షణీయమే అయినప్పటికీ ఆయన సమావేశాల చివరి వరకు ఉండాలని చురక అంటించారు. కాగా ఐకేరెడ్డికి రెండు నిమిషాలు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఆయన వేదికపై మాట్లాడుతుండగా పలువురు రచయితలు, కవులు తెలంగాణపై వైఖరి స్పష్టం చేసిన తరువాతనే ప్రసంగించాలని డిమాండ్ చేశారు. వైఖరి స్పష్టం చేయకుండా మాట్లాడడం సరి కాదన్నారు. దీంతో తెలంగాణ ప్రకటించనట్లయితే తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానని తెలిపి ప్రసంగాన్ని ముగించారు. మొత్తానికి ఐకేరెడ్డి వ్యవహారం తెలంగాణ రచయితల వేదిక మహాసభల్లో కొంత సేపు చర్చనీయాంశమైంది.


రాష్ట్ర మహాసభలకు హాజరైన మాజీ టీసీఎల్‌ఎఫ్ కన్వీనర్ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

### తెరవే మహాసభలపై

# ఇంటెలిజెన్స్ నిఘా

### లాడ్జీలు, సభాప్రాంగణం వద్ద మఫ్టీలో సంచారం

నిర్మల్, సెప్టెంబర్ 2(ఆన్‌లైన్): నిర్మల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ రచయితల వేదిక ఆరవ మహాసభలపై ఆద్యంతం ఇంటెలిజెన్స్ నిఘా కొనసాగడం చర్చనీయాంశమయ్యింది. ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన రాష్ట్ర పోలీసులు ఉదయం నుండి సాయంత్రం వరకు రచయితలను కాపుకాశారు. రచయితలు విడిది చేసిన లాడ్జీల వద్ద, అలాగే సభాప్రాంగణమైన రాజరాజేశ్వర గార్డెన్స్‌లో ఇంటలిజెన్స్ పోలీసులు ఎక్కువగా కనిపించారు. అలాగే మరికొంత మంది పోలీసులు మఫ్టీలో తిరుగుతూ మహాసభలకు హాజరైన వారి వివరాలను సేకరించడంలో నిమగ్నమయ్యారు. సమావేశానికి హాజరైన ప్రముఖ రచయితలు, కవుల ప్రసంగాలను వారు కూడా జర్నలిస్టులలాగా నోట్ చేసుకోవడం కనిపించింది. అలాగే సభ కార్యక్రమాన్ని ఉదయం నుండి సాయంత్రం వరకు ఇంటెలిజెన్స్ పోలీసులు వీడియో ద్వారా చిత్రీకరించినట్లు, దీనికోసం వారు ఓ కెమెరామెన్‌ను కూడా నియమించినట్లు స్పష్టంగా కనిపించింది. సభా ప్రాంగణానికి వచ్చిపోయే వారి వివరాలను కూడా వీరు సేకరించడం గమనార్హం. కాగా కొంత మంది ఇంటెలిజెన్స్ పోలీసులు ఇలా నిఘా కొనసాగిస్తుండగా, మరికొంత మంది మఫ్టి పోలీసులు ఇక్కడి కార్యక్రమ వివరాలను, ప్రసంగాల అంశాలను ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్‌ల ద్వారా ఉన్నతాధికారులకు అందించడం కనిపించింది. ప్రతి పది నిమిషాలకు ఒకసారి మఫ్టి పోలీసులు సెల్‌ఫోన్‌లతో కుస్తీ పట్టడం చర్చనీయాంశమయ్యింది. వీడియో చిత్రీకరణతో పాటు కార్యక్రమానికి హాజరైన వారి ఫొటోలను, వేదికపై ప్రసంగించిన వారి ఫోటోలను కూడా కెమెరాతో తీసినట్లు కనిపించింది. మొత్తానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన తెలంగాణ రచయితల వేదిక మహాసభలు ఇంటెలిజెన్స్ నిఘా నేత్రంలో బందీ అయ్యాయని చెప్పుకుంటున్నారు.